

కూలీలు లేక చేనుపైనే ఉన్న పత్తి

పత్తితీతకు కూలీల కొరత

- ఇబ్బంది పడుతున్న పత్తిరైతులు
- పొరుగు రాష్ట్రం నుంచి కూలీలు
- ఎకరాకు 25మంది కూలీలు అవసరం అంటున్నరైతులు

6

నాన్న ప్రోత్సాహంతోనే

- సారూ.. అని పిలవడంతోనే సివిల్స్‌పై మక్కువ
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి



తండ్రిని తన సీటులో కూర్చోబెట్టి ఆనందించిన ట్రైనీడిప్యూటీ కలెక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి

6

అధికార పార్టీపై అసంతృప్తి

● మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో నిరంజన్‌రెడ్డి

వనపర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని తన నివాసంలో 20వ వార్డుకు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలుపొందడం ఖాయమన్నారు. గత ప్రభుత్వంలో పట్టణంలో తాను చేసిన అభివృద్ధి తప్పా ఇప్పటికీ ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్ సిటీ లీగ్ టోర్నీలో ప్రతిభ

- మహబూబ్‌నగర్ జిల్లాకు 57 పతకాలు
- నాగర్‌కర్నూల్ 16, వనపర్తికి 13 పతకాలు

7



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

పెరిగిన టపాసుల ధరలు



వనపర్తి పట్టణంలో బాణసంచా కొనుగోలు చేస్తున్న జనం

నాగర్‌కర్నూల్‌టౌన్/ వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ వచ్చిందంటే చిన్న, పెద్ద అందరికి టపాసులు కాల్చాలనే ఉత్సాహం కలుగుతుంది. ప్రతిసారి లాగే ఈ సారి కూడా వెలుగు జిలుగుల మధ్య పండగను సంతోషంగా జరుపుకోవాలని అంతా రెడీ అయ్యారు. టపాసుల శబ్దాలతో గల్లీ అంతా దద్దరిల్లి పోయేలా చేద్దామనుకునే వారందరికి టపాసుల ధరలు చూసి గుండె గుబేలుమంటోంది. ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్య ప్రజలకు మాత్రం టపాసులు కొనడం పెద్ద సమస్యగా మారింది. జిల్లా కేంద్రంతో పాటు ప్రధాన పట్టణాల్లో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి టపాసులను అమ్ముతున్నారు. కానీ టపాసుల అమ్మకాలు ప్రారంభించి దాదాపు వారం రోజులు కావస్తున్నా పండగ ముందు రోజు వరకు కూడా షాపుల వద్ద జనం రద్దీ పెద్దగా కనిపించలేదు. దీంతో లక్షలకు లక్షలు ఖర్చుపెట్టి భారీగా తీసుకువచ్చిన టపాసులు గడవులోపు అమ్ముకుంటామా.. లేదోనని రిటైల్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన ధరలు

గత ఏడాదితో పోల్చుతే ఈ సారి టపాసుల ధరలు 20 శాతం పెరిగాయని వ్యాపారులు, కొనుగోలుదారులు చెబుతున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 270 వస్తువులపై జీఎస్టీ తగ్గించినా వాటి జాబితాలో బాణాసంచా లేదు. పెరిగిన ధరలతో బాణాసంచా సైజును బట్టి భూచక్రాలు రూ.30 నుంచి రూ.50, చిచ్చుబుడ్లు బాక్స్ రూ.100 నుంచి రూ.200, లక్ష్మీబాంబు ప్యాకెట్(10) రూ.200 నుంచి రూ.600, మిర్చి బాంబు ప్యాకెట్ రూ.80 నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం పడుతోందని వ్యాపారులు అంటున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 125.00
హోల్ సేల్	: 134.00
డ్రెస్డ్	: 213.00
స్కిన్ లెస్	: 243.00

నూనె గింజల.. ఉత్పత్తి పెరిగేనా!

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్ఎంఈవో పథకం అమలు
- వందశాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీకి నిర్ణయం
- నారాయణపేట జిల్లాలో 8 వేల ఎకరాల్లో సాగుకు అంచనా
- 3 వేల ఎకరాలకే అందజేత
- రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా ఎంపిక
- అందరికీ ఇవ్వాలంటున్నరైతులు



నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం దేశాయపల్లిలో ట్రాక్టర్‌తో వేస్తున్న వేరుశనగ విత్తనాలు

నారాయణపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ నూనెగింజల ఉత్పత్తి నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్ఎంఈవో) పథకం కింద ఎనిమిది జిల్లాల్లో రూ. 46.15 కోట్లతో మేలు రకమైన వేరుశనగ విత్తనాలు వంద శాతం సబ్సిడీతో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై వేరుశనగ అందించడం శుభపరిణామమైనా అరకొరగా విత్తనాల సరఫరాతో నూనెగింజల ఉత్పత్తి పెరగడం ఎలా అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆశయం నెరవేరాలంటే పూర్తి స్థాయిలో సాగుకు అవసరమైన విత్తనాలు రైతులకు అందించి సాగు సమయంలో తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు అందిస్తూ ఉచితంగా అవసరమైన ఎరువులు, చీడపురుగుల నివారణ మందులు అందించి మార్కెట్‌లో మద్దతు ధర కల్పించి అన్నివిధాలుగా అన్నదాలకు అండగా నిలవాలని రైతులు కోరుతున్నారు.

రూ. 46.15 కోట్ల మేలు రకం విత్తనాలు

రాష్ట్రంలో 2025-26 ప్రస్తుత రబీ సీజన్‌లో 45,350 ఎకరాల్లో వేరుశనగ పంట సాగుకోసం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, రంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ, నారాయణపేట జిల్లాల్లో రూ. 46.15 కోట్లతో దేశంలో పేరొందిన మేలురకాలైన జీజేజీ-32 రకం 19,480 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి 18,212 క్వింటాళ్లు, గిర్నార్ రకం 782 క్వింటాళ్ల విత్తనాలు ఇలా మొత్తం 38,474 క్వింటాళ్ల వేరుశనగ వంద శాతం సబ్సిడీపై పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మేలు రకాల విత్తనాల వల్ల 50 శాతం అధికంగా దిగుబడి పెరుగుతుందని దాంతో పాటు పంట ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ధర వస్తుందని అధికారులు చెబుతున్నారు. అలాగే రూ. 2.50 కోట్లతో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీడ్ హబ్, విత్తన నిల్వల యూనిట్ల ఏర్పాటు, రూ. 2.37 కోట్లతో నూనెతీసే యంత్రాల సరఫరా, రూ. 47.06 కోట్లతో అధిక దిగుబడులిచ్చే వంగడాలు, పురుగులు, తెగుళ్ల బెడద తట్టుకునే విత్తనాల అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించింది.

నారాయణపేట జిల్లాలో..

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఎనిమిది వేల ఎకరాల వేరుశనగ పంటల సాగుకు గాను కేవలం మూడువేల ఎకరాలకు సరిపోయేలా

(మిగతా 6లో..)

ఎంబీఏ, ఎంసీఏలలో స్పాట్ అడ్మిషన్లు

● ఈ నెల 21, 22 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలి

● పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్ బాబు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని యూనివర్సిటీ క్యాంపస్ పీజీ సెంటర్, కొల్లాపూర్, గద్వాల పీజీ సెంటర్లతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎంబీఏ, ఎంసీఏ సీట్ల కోసం ఐసెట్ క్వాలిఫై అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ కోసం ఈ నెల 21, 22 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు పాలమూరు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. అభ్యర్థులు తమకు నచ్చిన కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మిషన్ భగీరథ పైపులైనుకు మరమ్మతు

జడ్చర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ పైపులైనుకు ఆదివారం మరమ్మతు పనులు చేపట్టారు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నుంచి బాదేపల్లి పట్టణంలోని శ్రీరంగనాయకస్వామి గుట్టపైకి పంపింగ్ చేసే పైపులైను వాల్వు రిపేర్‌కు రావడంతో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మిషన్‌భగీరథ అధికారులతో మాట్లాడి మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. పైపులైనులో 900 ఎంఎం జీరో వెలాసిటీ గ్యాస్‌కిట్లు, స్ప్రింగ్స్ మరమ్మతు పనులు చేయించారు. రంగనాయకస్వామి గుట్టపై నిర్మించిన సంపు నుంచి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. జడ్చర్ల పట్టణానికి సమీపంలో ఉన్న యాసాయికుంట తండాకు గడిచిన వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు మిషన్‌భగీరథ అధికారులు తెలిపారు.



జడ్చర్ల పట్టణంలోని శ్రీరంగనాయకస్వామి గుట్టపైకి నీటిని పంపింగ్ చేసే పైపులైను వాల్వును మరమ్మతు చేస్తున్న సిబ్బంది

గ్రామాల్లో దాహం.. దాహం..

● మిషన్ భగీరథ పైపులైన్లు పగిలిపోవడంతో నిలిచిన సరఫరా



లింగంపల్లిలో వాటర్ ట్యాంకువద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

నవాబ్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జడ్చర్ల మండలంలో మిషన్ భగీరథ పైపులైన్లు పగిలిపోవడంతో నీరు సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో పలువురు పంటపొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. లింగంపల్లి గ్రామంలో ప్రజల అవసరాలను గుర్తించి వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

నూనె గింజల ఉత్పత్తి పెరిగేనా!

(5వ పేజీ తరువాయి)

వందశాతం సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. దాంతో అరకొరగా విత్తనాలు పంపిణీ చెయ్యడం తగదని రైతాంగం వాపోతోంది. జిల్లాకు 3,045 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అని వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు పంపించినా అరకొరగా వచ్చాయి. 1470 క్వింటాళ్ల వేరుశనగ గుండ్లు, 1557 క్వింటాళ్ల వేరుశనగ కాయలు రావడంతో ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా అరకొరగా పంపిణీ చేశారు. మిగతా ఐదువేల ఎకరాలు సాగు చేసే రైతాంగం బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ గుండ్లు రూ. 11,500 నుంచి రూ.12,000 వరకు చెల్లించి కొనుగోలు చేసి రైతులు వేరుశనగ పంట సాగు చేశారు. జిల్లాలో వేరుశనగ సాగు దసరా పండుగకు ప్రారంభమై దీపావళి వరకు పూర్తి కానుంది. గత ఏడాది రబీలో వేరుశనగ పదివేల ఎకరాల్లో సాగైతే ఈ సారి ఎనిమిది వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీంతో రెండువేల ఎకరాల్లో సాగు తగ్గనుంది. అడవి పందుల బెడద అధికంగా ఉండటంతో పాటు జింకలు పరుగులతో తొక్కడం. తెగుళ్లు, అధిక పెట్టుబడి వల్ల వేరుశనగ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.



వేరుశనగ విత్తనాలు



వేరుశనగ పంట(ఫైల్)

● నాగర్‌కర్నూల్ జిల్లాలో 16,000 ఎకరాలల్లో వేరుశనగ సాగుకు గాను 14,400 ఎకరాలకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 5,300 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. ఎకరాకు 90 కిలోల చొప్పున ఇచ్చారు. జిల్లాలో 20 మండలాలకు గాను 12 మండలాలను ఎంపిక చేశారు.

రెండు ఎకరాల్లో పల్లి సాగు చేశా

రెండు ఎకరాల్లో పల్లి సాగు చేశా. ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై రెండు బస్తాల శనగకాయ ఇస్తే అది పలుకుగా మారిస్తే 25 కిలోల గుండ్లు మాత్రమే వచ్చాయి. ఎకరాకు 70 నుంచి 80 కిలోల పల్లిగుండ్లు కావాలి. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ విత్తనాలు సరిపోక ప్రైవేట్‌లో క్వింటాల్ రూ. 12 వేలు వెచ్చించి క్వింటాల్ పల్లీలు కొనుగోలు చేసి పంట సాగుచేశా.



- జి. అంజప్ప, దేశాయపల్లి రైతు, దామరగిద్ద మండలం

60 కేజీలు మాత్రమే ఇచ్చారు

పట్టాదారు పాస్‌బుక్‌కు 60 కేజీల పల్లి గుండ్లు మాత్రమే వంద శాతం సబ్సిడీపై ఇచ్చారు. రెండు ఎకరాల సాగు కోసం మరో క్వింటాల్ పల్లి గుండ్లు క్వింటాల్‌కు రూ. 11,500 తో కొనుగోలు చేసి వేశాను. రైతులకు అవసరం మేరకు పల్లి విత్తనాలు అందక ఇబ్బందులు తప్ప లేదు.



- కుమారస్వామి, కిషన్‌నగర్ గ్రామం, కొత్తపల్లి

సైకిల్‌పై 18 వేల కిలో మీటర్ల యాత్ర



మాట్లాడుతున్న మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, చిత్రంలో సైకిల్‌యాత్ర చేసిన మల్లేశ్ గౌడ్

● 12 జ్యోతిర్లింగాలు.. 8 శక్తిపీఠాలను సందర్శించిన పాలమూరు యువకుడు

● ఘన స్వాగతం పలికిన పట్టణవాసులు

మహబూబ్‌నగర్/భూత్పూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ చదివిన ఓ విద్యార్థి సైకిల్‌యాత్ర చేపట్టాడు. ఏడాది పాటు చేసిన యాత్రలో 12 జ్యోతిర్లింగాలు.. 8 శక్తిపీఠాలను సందర్శించారు. ఏకంగా 18 వేల కి.మీ సైకిల్ యాత్ర చేపట్టి ఆదివారం ఇంటికి తిరిగి రావడంతో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బోయపల్లికి చెందిన మునిమంద మల్లేశ్‌గౌడ్ గతేడాది అక్టోబరులో గ్రామం నుంచి సైకిల్‌యాత్ర చేపట్టాడు. ఏడాది పాటు జ్యోతిర్లింగాలు, శక్తిపీఠాలతో పాటు చార్ధామ్ యా త్రలు, పంచరామాలు, పంచభూత లింగాలను దర్శించుకుని నేడు పాలమూరుకు రాగా, గ్రామస్థులు స్వాగతం పలికి సత్కరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, మాజీ కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికాలంగా సాహసోపేతమైన యాత్ర నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అంతకుముం దు భూత్పూర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మురళీధర్ గౌడ్ ఆధ్వర్యంలో మల్లేష్‌కు స్వాగతం పలికి పూలమాల, శాలువాతో సత్కరించారు. అమిస్తాపూర్‌లో యువకులు స్వా తగం పలికారు. బ్రహ్మయ్యచారి, కడప నారాయణ, టైగర్ నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కూచూర్ పెద్ద చెరువుకు గండి

నవాబ్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచూర్ పెద్ద చెరువు అలుగు లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతుందని గ్రామస్థులు పేర్కొన్నారు. పెద్ద చెరువు అలుగు శిథిలావస్థకు చేరుకుని నీరు రంధ్రాల ద్వారా వృథాగా పోవడంతో సంబంధిత శాఖల అధికారులు స్పందించి మూసివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గండిపడి వృథాగా పోతున్న నీళ్లు

నాన్న ప్రోత్సాహంతోనే

» సారూ.. అని పిలవడంతోనే సివిల్స్‌పై మక్కువ

» ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డితో ముఖాముఖి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో చదువులో అంతంత మాత్రమే రాణించిన ఆ అబ్బాయి ఎదిగే క్రమంలో తల్లి దండ్రులు, మేనమామ ప్రోత్సాహంతో ఉన్నత చదువులు అభ్యసించి గ్రూప్-1లో రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంకు సాధించి జోగుళాంబ గద్వాల జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నన్నూరి మనోజ్‌కుమార్‌రెడ్డితో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ.

మీ కుటుంబ నేపథ్యం..

నల్గొండ జిల్లా మునుగోడు మండలం గుడాపూర్ మా స్వగ్రామం.. కానీ ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. మా తండ్రి వెంకటరామిరెడ్డి వ్యవసాయంతో పాటు ఫార్మాడిస్ట్రిబ్యూషన్ వ్యాపారం చేస్తున్నారు. తల్లి విజయలక్ష్మి నల్గొండ జిల్లా గట్టు ఉప్పల్ మండలం నామాపురం ఎంపీపీఎస్‌లో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. అక్క సాధన అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు.

మీ విద్యాభ్యాసం.. ఎలా సాగింది..

ప్రాథమిక విద్యను నల్లగొండ పట్టణంలో పూర్తిచేశాను. అప్పుడు అంతంగానే చదివేది. సూర్యాపేటలో మేనమామ నిర్వహిస్తున్న పాఠశాలలో చేరి ఆయన ప్రోత్సాహంతో మెరిట్ విద్యార్థిగా పేరు తెచ్చుకున్నా.. ఆరు నుంచి పదోతరగతి వరకు అక్కడ చదివాను. పదిలో 9.8 జీపీఏ సాధించి మంచి ర్యాంకర్‌గా నిలిచాను. హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించి 971 మార్కులు సాధించాను. ఇంజనీరింగ్‌లో 72శాతం మార్కులతో కళాశాల ఈసీఈ బ్రాంచ్ టాపర్‌గా నిలిచాను. ఢిల్లీలోని ఇగ్నో విశ్వవిద్యాలయంలో ఎంఏ(సోషియాలజి)పూర్తి చేశాను.

సివిల్స్‌పై ఎక్కడ శిక్షణ పొందారు..

2019లో ఢిల్లీలో సివిల్స్‌లో శిక్షణ తీసుకున్నాను. 2020-2021లో రెండుసార్లు ప్రిలిమ్స్‌లోనే మంచి మార్కులు సాధించలేకపోయాను. మా నాన్న నన్ను ప్రోత్సహించడానికి మనోజ్‌కుమార్ సారు.. అని పిలవడం ప్రారంభించారు. తనపై తండ్రికి ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయరాదనే సివిల్స్‌తో పాటు గ్రూప్స్ కూడా సిద్ధమయ్యాను. 2022లో సివిల్స్‌లో ప్రిలిమ్స్ పాస్ అయినప్పటికీ మెయిన్స్ దాటలేకపోయాను. ఐఎఫ్ఎస్ కూడా ప్రయత్నించినప్పటికి మెయిన్స్‌లో వెనుతిరగాల్సి వచ్చింది. గ్రూప్-1 పరీక్షలకు కోర్టు అడ్డంకులు రావడంతో గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను రాశాను.

సివిల్స్ సాధనే లక్షం..

తాను సివిల్స్ సాధించడమే లక్ష్యం. తాను ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న సమయంలో పాఠశాల వార్షికోత్సవానికి ఎస్పీ ముఖ్య అతిథిగా వచ్చారు. ఆయనకు ప్రతీ ఒక్కరు ఎంతో గౌరవాన్ని ఇవ్వడాన్ని గమనించాను. అప్పటి నుంచి సివిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా.. శిక్షణ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూనే సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నా..

యువతకు మీరిచ్చే సూచనలు..

యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి. ప్రస్తుతం సమాజంలో యువత తాత్కాలిక సంతోషాల కోసం పరుగులు తీస్తున్నారు. యువత సెల్‌ఫోన్ వ్యసనాల బారిన పడకుండా నైతిక విలువలతో కూడిన జీవనానికి అలవాటు కావాలి. ప్రతీ ఒక్కరు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి.

మీరు ఎలాంటి సేవలందిస్తారు..

సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు కనీస అవసరాలు సమకూరేలా తన వంతు కృషి చేస్తా. ఏఐ వంటి సాంకేతిక విషయాల్లో అట్టడుగు వర్గాల ప్రజలకు సైతం ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందినప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. తెలంగాణ రైసింగ్ విజన్ 2047 ప్రజాభిప్రాయ సేకరణలో తానుకూడా పాల్గొని సలహాలు, సూచనలు చేశానని తెలిపారు. తాను శిక్షణ పొందే కాలంలో జోగుళాంబ గద్వాల జిల్లా అక్షరాస్యత మెరుగుపరిచేందుకు కృషి చేస్తాను. జోగుళాంబ అమ్మవారి ఆశీస్సులతో గద్వాల జిల్లా సామాజికంగా, ఆర్థికంగా, అన్ని రంగాల్లో ముందుండేలా అకాంక్షిస్తున్నానని తెలిపారు.

పత్తితీతకు కూలీల కొరత

» ఇబ్బంది పడుతున్న రైతులు

» పొరుగు రాష్ట్రం నుంచి కూలీలు

» ఎకరాకు 25మంది అవసరం అంటున్న రైతులు

అచ్చంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తిరైతులకు పంట సాగుచేయడం ఒక ఎత్తైతే పత్తితీయడం సమస్యగా మారింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని ఉమ్మడి ఆరు మండలాల్లో 1,55,429 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేస్తే పత్తి పంట 1,02,858 ఎకరాలలో సాగు చేశారు. ఈ ఏడాది ఎడతెరపిలేకుండా వర్షాలు కురవడంతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎకరాకు దాదాపు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 3 నుంచి 6 క్వింటాళ్లు కూడా దాటడంలేదని రైతులు వాపోతున్నారు. ఎకర పత్తి తీసేందుకు దాదాపు 25 మంది కూలీలు అవసరం ఉంటుదని వాపోతున్నారు. స్థానికంగా కూలీలు దొరకకపోవడంతో పక్కనున్న ఆంధ్ర రాష్ట్రం నుంచి కూలీలను తెప్పించుకొని పత్తిని తీయిస్తున్నారు. మరి కొందరు రైతులు చదువుకునే తమ పిల్లలను పత్తితీసే పనిచేయిస్తున్నారు.



పత్తి చేను వద్ద భోజనం చేస్తున్న కూలీలు



పత్తిచేనులో చేరిన వర్షపు నీరు

ఎకరా పత్తి తీయాలంటే రూ.15 వేలు అవుతోంది..

ఎకరా విస్తీర్ణంలో పత్తి తీసేందుకు రూ.15 వేల నుంచి రూ. 18 వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. ఒక్క కూలీకి రూ.500 నుంచి రూ.600 వరకు కూలీ చెల్లించాల్సి వస్తోంది. దీంతో పాటు దూపనీళ్లు కూడా ఇవ్వాలి.. వీటిలో ఏది తక్కువైన మరుసటి రోజు కూలీకి వచ్చేందుకు అసక్తి చూపడంలేదు.

శ్రీశైలం ప్రాజెక్టులో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

గద్వాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు వరద తగ్గింది. శనివారం ప్రాజెక్టుకు 31,145 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రం ద్వారా 49,481 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 200.19 టీఎంసీల నిల్వ ఉంది. కాగా ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల గేట్లు కూడా మూతపడటంతో జూరాలకు 23 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు గేట్లను మూసివేసి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 23,166 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల డ్యాంకు రెండువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా డ్యాం గేట్లను మూసివేశారు.

మిద్దె ఎత్తుకు జొన్న మొక్క

- 20 అడుగుల మేర పెరిగిన మొక్క



కొల్లాపూర్‌లో ఇంటి ముందు 20 అడుగులకు పైగా పెరిగిన జొన్న మొక్క

కొల్లాపూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీ సమీపంలో చౌటబెట్ల గ్రామం రహదారిలో ఉపాధ్యాయుడు ముడావత్ రమేష్ ఇంటి ముందు ఉన్న జొన్న మొక్క ఏపుగా పెరిగింది. జొన్న మొక్క సాధారణంగా ఐదు, లేదా ఆరు అడుగుల ఎత్తు పెరుగుతుంది. కానీ, ఏకంగా 20 అడుగుల ఎత్తు పెరగడంతో అటుగా వచ్చిపోయే వాళ్లు, కాలనీ ప్రజలు దాన్ని తల ఎత్తి చూడాల్సి వస్తున్నందున 'అబ్బా అంత ఎత్తు పెరిగింది' అని చర్చించుకుంటున్నారు. దాని కోసమని ప్రత్యేకంగా ఎలాంటి మందులు వేయలేదు. సాధారణంగానే అది అలా పెరిగిందని ఉపాధ్యాయుడు రమేష్ అన్నారు.

- కొల్లాపూర్, (ఆంధ్రజ్యోతి)

శిథిలావస్థకు చేరిన కాజ్‌వేలు



పొల్మూరు గుట్టలపల్లి గ్రామాల మధ్య ప్రమాదభరితంగా ఉన్న లోలెవల్ కాజ్‌వే

» ప్రమాదాల బారిన పడుతున్న జనాలు

» లోలెవల్ కాజ్‌వేలపై నిత్యం ప్రమాదాలు

» వరదల సమయాల్లో ప్రాణాలు కోల్పోతున్న సామాన్యులు

» హైలెవల్ వంతెనలు నిర్మించాలంటున్న ఆయా గ్రామాల ప్రజలు

తాడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై ఉండే లోలెవల్ కాజ్‌వేలు ఉండే ప్రస్తుతం ప్రమాదాలకు నెలవుగా మారాయి. వర్షాలు కురుస్తున్న సమయంలో లోలెవల్ కాజ్‌వేలపై నుంచి వరద ప్రవాహాలు ఎక్కిపారుతున్న సమయంలో ప్రతీనిత్యం ప్రమాదాలు జరగడంతో పాటు చాలా మంది తీవ్ర గాయాలపాలై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు సైతం చోటు చేసుకున్నాయి. వరద ప్రవాహాల ధాటికి కాజ్‌వేలు పూర్తిస్థాయిలో దెబ్బతినడంతో వరదల అనంతరం వాహనాల రాకపోకలకు సైతం తీవ్ర ఇబ్బందికరంగా మారుతుంది.

మండలంలో లోలెవల్ కాజ్‌వేల వివరాలు

మండలంలోని ఐతోల్ వద్ద నాగర్‌కర్నూల్ జడ్చర్ల ప్రధాన రహదారిపై లోలెవల్ కాజ్‌వే ఉంది. భలాన్‌పల్లి చెరువులు అలుగు పారిన క్రమంలో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న క్రమంలో ప్రతీ నిత్యం కాజ్‌వేపై నుంచి వరద నీరు పారడం మూలంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుస్థితి. అదేవిధంగా ఐతోల్ నుంచి గోవిందాయపల్లి, ఆకునెల్లికుదురు గ్రామాల మధ్యలో సైతం మరో మూడు లోలెవల్ కాజ్‌వేలు ఉన్నాయి. వర్షం కురిసిందంటే చాలు ప్రతీనిత్యం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయే దుస్థితి నెలకొంటుంది. ఇటీవల రెండేళ్ల క్రితం నాగదేవ్‌పల్లి లోలెవల్ కాజ్‌వే వద్ద వరద ప్రవాహం దాటుతున్న వ్యక్తి వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన అనంతరం మృతదేహం దుందుభీ నదిలో తేలింది. అదే విధంగా పొల్మూరు, గుట్టలపల్లి, అల్లాపూర్, యంగంపల్లి, యాదిరెడ్డిపల్లి, అంతారం, భలాన్‌పల్లి, ఐతోల్, యత్మతాపూర్, తుమ్మలసూగురు గ్రామాల మధ్య సైతం లోలెవల్ కాజ్‌వేలు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఇప్పటికైనా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి అతి ముఖ్యమైన లోలెవల్ కాజ్‌వేల వద్ద హైలెవల్ వంతెనలు నిర్మించి రాకపోకలను సజావుగా కొనసాగించడంతో పాటు సామాన్య ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

వానొస్తే రాకపోకలు బంద్



గ్రామ సమీపంలో ఉన్న రెండు లోలెవల్ కాజ్ వేల వద్ద వర్షం వచ్చిందంటే వరద ప్రవాహం భారీగా వస్తోంది. దీంతో ఆ సమయంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. లోలెవల్ కాజ్ వేలు పూర్తి లోపలికి ఉన్నందున వరద ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం కాజ్‌వేల వద్ద హైలెవల్ వంతెన నిర్మిస్తే బాగుంటుంది.

- వెంకటయ్య, ఆకునెల్లికుదురు గ్రామం

కాజ్‌వేపై వంతెన నిర్మించాలి



ఐతోల్, భలాన్‌పల్లి గ్రామాలతో పాటు నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రధాన రహదారిపై ఉన్న ఐతోల్ సమీపంలోని లోలెవల్ కాజ్‌వేపై ప్రతినిత్యం వాహనాల రాకపోకలు పెద్ద ఎత్తున కొనసాగుతుంటాయి. వర్షాలు కురిసిన సమయంలో వరద వస్తే వాహనదారులు నిలుపుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఆర్అండ్‌బీ రహదారిపై హైలెవల్ వంతెన నిర్మించి రాకపోకలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

- అశోక్‌కుమార్, భలాన్‌పల్లి మాజీ సర్పంచ్

మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతకు భక్తులు పూజలు నిర్వహించారు. ఈ ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 15వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం రూ.1,48, 632 ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు.

క్రైం కార్నర్

పాముకాటుకు వ్యక్తి మృతి


మల్లయ్య(ఫైల్)

నవాబ్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గొర్లను మేపుతున్న చోట పాము కరిచి వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కూచూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్లయ్య(55) శనివారం తన గొర్లను మేపుకుంటూ రాజాపూర్ మండలంలో గొర్లను మేపుతుండగా పచ్చిగడ్డిపై కాలుపెట్టగా అందులో ఉన్న పాము కరిచింది. తోటి కాపరులు గమనించి చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అనంతరం ఇంటికి తరలించి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా, అప్పటికే మృతి చెందాడు. మల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. మల్లయ్య మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

నవాబ్‌పేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నవాబ్‌పేట మండలంలోని ఫత్తేపూర్ గేట్ సమీపంలో ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొని ద్విచక్రవాహన దారుడు తీవ్ర గాయాల పాలైనట్లు 108 ఈఎంటీ యాదయ్య తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఢీకొని కిందపడి గాయాల పాలవ్వడం గుర్తించిన వాహనదారులు 108కు సామాచారం ఇచ్చారు. దీంతో వారు అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని ఈఎంటీ యాదయ్య తెలిపారు.

కుక్కను తప్పించబోయి..

» బైక్‌పై నుంచి కిందపడి వ్యక్తి మృతి


బాబా (ఫైల్)

మదనాపురం అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్‌పై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కొత్తకోట పట్టణానికి చెందిన బాబా (35) మదనాపురంలో మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం షాప్ బంద్ చేసి భోజనం చేయడానికి కొత్తకోటకు వెళ్తుండగా గోవిందహళ్లి గ్రామ శివారులో గల మైసమ్మ గుడి దగ్గర అకస్మాత్తుగా కుక్క అడ్డం రాగా దానిని ఢీకొట్టి కింద పడి పోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా, మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తాగేందుకు భార్య డబ్బులివ్వలేదని..

బాలానగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భార్య తాగేందుకు డబ్బులివ్వలేదని రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని పెద్దా యపల్లి శివారులో ఆదివారం ఉదయం చోటుచేసుకున్నది.. ఇందుకు సంబం ధించిన వివరాలు.. నవాబుపేట మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెంది న గోవింద్ వెంకటయ్య (45) షాద్‌నగర్ పట్టణంలోని నాగులపల్లి చౌరస్తాలో టిఫిన్ సెంటర్ పెట్టుకొని జీవిస్తున్నాడు. వెంకటయ్య తాగుడుకు బానిస అ య్యాడు. తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్తాపంలో కర్నాటక సం పర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్టేషన్ మాస్టర్ భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు.

కోడ్ తొలగింది కోక మిగిలింది!

» మహిళల దరి చేరని రాష్ట్ర ప్రభుత్వ దసరా కానుక

» అందని అక్కాచెల్లెళ్ల చీరలు, ప్రోత్సాహకాలు


అలంపూర్ గోడౌన్‌లో ఉన్న ఇందిరమ్మ చీరలు

అయిజ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ తొలగింది.. కానీ కోక అందకుండా మిగిలింది. వచ్చిన చీరలు పంపిణీకి నోచుకోక గోడౌన్‌లకే పరిమితం అయ్యాయి. దసరా అన్నారు... దీపావళి అనుకున్నారు... కానీ ఇంకా ముందుకు సాగలేదు. ప్రజాప్రతినిధులు మాత్రం న వంబరు అంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దసరా కానుకగా ఒక్కో మహిళా సంఘానికి రూ. 15,000, మహిళా సంఘ సభ్యులకు ఒక్కొక్కరికి రెండు చీరలు అందచేస్తామన్నారు. అక్కాచెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక పేరిట చేనేత చీరలు అందచేయటానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. సెప్టెంబరులో రాష్ట్రంలో బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. అంతకుముందే చీరలు, ప్రోత్సాహకాలు అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకొచ్చింది. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కా ర్డులో ఉన్న సభ్యుల్లో ఒక్కరికి మాత్రమే చీర ఇచ్చేవారు. కానీ కాంగ్రెస్ ప్రభు త్వం సహాయక సంఘాల్లోని ప్రతీ మహిళా సంఘ సభ్యులకు ఒక్కొక్కరికి 2 చీ రలు అందచేయాలని భావించింది. మెప్మా ద్వారా నగరపాలక, పురపాలక సంఘాల పరిధిలోని సభ్యుల వివరాలు, డీఆర్‌డీవో ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘం సభ్యుల వివరాలు సేకరించారు.

గోడౌన్‌లకే పరిమితమైన చీరలు

దసరా పండుగకు ముందే చీరలు జిల్లాలోని గోడౌన్‌లకు చేరాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో మెప్మా పరిధిలో 20,990, డీఆర్‌డీవో పరిధిలో 40,470 మంది మహిళా సంఘ సభ్యులు ఉన్నారు. జిల్లా మొత్తంగా 61,460 మంది మహిళా సంఘ సభ్యులకు ఇందిరమ్మ చీరలు అందించాలనుకున్నారు. మహిళా సంఘ సభ్యులకు అవసరమైన చీరలు ఆయా జిల్లాలకు చేరాయి. జిల్లాకు సంబంధించి అలంపూర్ చౌరస్తాలోని గోడౌన్‌లలో భద్రపరిచారు.

ఆదేశాలు అందిన వెంటనే అందేలా చూస్తాం



చీరలు గోడౌన్‌లో భద్రపర్చటం జరిగింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే మహిళా సంఘం సభ్యులకు అందేలా చూస్తాం. ఇప్పటికే పూర్తి స్థాయి సమాచారం ఉంది. అమలు పరుస్తాం.

-శ్రీనివాసరావు, అదనపు పీడీ, గ్రామీణాభివృద్ధి శాఖ

సీసీ రోడ్ల శిలాఫలకం కూల్చివేత

» రోడ్డుపై బైఠాయించి నిరసన - పోలీసులకు ఫిర్యాదు


బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

అమ్రాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణ శిలాఫలాకాన్ని కూల్చివేతకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కొద్దిసేపు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. అమ్రాబాద్ మండల పరిధిలోని కుమ్మరోనిపల్లి గ్రామానికి చెందిన జబ్బు పెద్దలు (కాంగ్రెస్ నాయకుడు) కూల్చివేశాడని ఆరోపిస్తూ ఆదివారం అచ్చంపేట-మద్దిమడుగు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 50 లక్షల రూపాయలతో రోడ్లు నిర్మించిన దానికి సంబంధించిన శిలాఫలకం కూల్చివేతకు పాల్పడిన పెద్దలుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ కొనసాగుతున్నదని పోలీసులు వెల్లడించారు.

గుట్టుచప్పుడు కాకుండా కలప రవాణా

» పట్టించుకోని ఫారెస్టు అధికారులు


ట్రాక్టర్‌లో లోడు చేస్తున్న కలప

గుండుమాల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా గుండుమాల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రతీరోజు అక్రమంగా చెట్లను నరికి ట్రాక్టర్ల ద్వారా కట్టెల మిషన్లకు తరలిస్తున్నారు. ఫారెస్టు అధికారుల వద్ద వేప, తుమ్మ, మామిడి చెట్లకు నరకడానికి పర్మిషన్ లేని చెట్లను కూడా నరుకుతున్నారు. తరువాత వాటిని చిన్న ముక్కలుగా కట్ చేసి డీసీఎంలలో లోడ్ చేసి ప్రతీరోజు సాయంత్రం సమయంలో కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న ఫారెస్టు అధికారులకు ఏదో రకంగా అమ్యామ్యాలు చెల్లించి వారితో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ప్రభుత్వ అను మతి ప్రకారం ఒక చెట్టుకు రూ.500 డబ్బులు కట్టి పర్మిషన్ తీసుకోవాలి. ప్రతీరోజు గుండుమాల్ నుంచి మద్దూర్ మండలంలోని కట్టెల మిషన్లకు కలపను తరలిస్తున్నారు. మండలం నుంచి విచ్చలవిడిగా కలప రవాణా జరుగుతున్నా ఫారెస్టు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొన్నారు. కొంతమంది రెవెన్యూ సిబ్బంది కూడా కట్టెల వ్యాపారుల వద్ద మామూళ్లు తీసుకొని వ్యాపారం కొనసాగిస్తున్నారని తెలిసింది. ప్రతీరోజు రాత్రి సమయాల్లో కట్టెల వ్యాపారులు లేబర్‌ను పెట్టి చెట్లను కొట్టిస్తున్నారు. ఉదయం వేళల్లో ఎవరి కంటికి కనిపించకుండా కట్టెల మిషన్లకు సరఫరా చేస్తున్నారు.


అక్రమంగా కలపను తరలిస్తున్న ట్రాక్టర్

అనుమతి లేకుండా నరికితే చర్యలు

ఎవరైనా అనుమతి లేకుండా చెట్లను నరికితే వారిపై చర్యలు తీసుకుంటాం. వేప, తుమ్మ, మామిడి చెట్లకు మాత్రమే రూ.500 తీసుకొని పర్మిషన్ ఇస్తున్నాం. ఇతర చెట్లకు ఎటువంటి పర్మిషన్లు ఇవ్వలేదు.

- కమాలొద్దీన్, ఫారెస్టు అధికారి

రికార్డుకు చేరువలో జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో ఇప్పటివరకు చేపట్టిన రికార్డుకు చేరువలో జల విద్యుత్ ఉత్పత్తి చేరుకున్నట్లు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు స్వల్పంగా వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తిని నిరంతరాయంగా చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్లు ప్రారంభించి గడచిన 24 గంటల్లో 2.590 మిలియన్ యూనిట్లను చేపట్టగా ప్రారంభించిన నాటినుంచి ఇప్పటి వరకు 438.509 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో 4 యూనిట్లను ప్రారంభించి 2.919 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 425.101 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. వరద ఇదే మాదిరిగానే కొనసాగితే ఇదివరకు ఎగువ దిగువ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా చేపట్టిన 890 మిలియన్ యూనిట్లను త్వరలోనే అధికమించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.


దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

యోగా టోర్నీలో పతకాలు సాధించాలి

» జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్

» ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా యోగా జట్ల ఎంపికలు


మాట్లాడుతున్న జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో పతకాలు సాధించాలని ఉమ్మడి జిల్లా ఒ లింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అన్నారు. రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల బాలికల జట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఎంపికలను జిల్లా ఒ లింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, యోగాతో చదువులో చురుకుగా రాణిస్తారని తెలిపారు. టోర్నీలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు చోటు దక్కించుకోవాలన్నారు. జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి బా లరాజు, శరణ్య, మణికంఠ, వపన్‌కుమార్, వెంకటేశ్, బాలమణి, నర్సింహులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికైన నంచర్ల బాలిక


చందన

మహమ్మదాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్ -14 బాలికల కబడ్డీ జట్టులో నంచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న చందన ఎంపికైంది. ఈ నెల 16న పటాన్‌చెర్వులో జరిగి 69 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో అండర్-14 (బాలికల) విభాగంలో ప్రతిభ కనపరిచినందుకు గాను జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైంది. దీంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

తాటిచెట్ల నరికివేత


బాదేపల్లి శివారులో నరికివేసిన తాటిచెట్లు

జడ్చర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాదేపల్లి పట్టణ శివారులోని సర్వే నెంబరు 155/ఎలో ఉన్న 10 తాటిచెట్లను ఇద్దరు వ్యక్తులు నరికివేసారంటూ బాధితులు సుధాకర్‌గౌడ్, సుజాత ఆదివారం జడ్చర్ల ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాదేపల్లి పట్టణ శివారులో ఉన్న 10 తాటిచెట్లతో కల్లు గీసుకుని జీవనోపాధి పొందుతున్నామని, అలాంటి తాటిచెట్లను ఇద్దరు వ్యక్తులు నరికివేసారని ఆవేదన వ్యక్తం చేశారు. తాటిచెట్లను నరికివేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

తెరపైకి సాగునీటి సంఘాలు

» నీటి వనరుల వినియోగంపై పర్యవేక్షణ

» చెరువుల అభివృద్ధే లక్ష్యం

» ఆయకట్టు రైతులకు తొలగనున్న ఇబ్బందులు


ఖిల్లాఘణపురం మండలంలోని మల్కిమియాన్‌పల్లి చిన్నయ్య కుంట చెరువు

ఖిల్లాఘణపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి సాగు నీటిని అందించడానికి గతంలో సాగు నీటి సంఘాల ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉండేది. గత 17 సంవత్సరాలుగా మనుగడలో లేనీ నీటి సంఘాలను పునరుద్ధరించాలని తెలంగాణ ప్రభుత్వం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించడంతో సాగు నీటి సంఘాలు మళ్లీ తెరపైకి రానున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చెరువులు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారిగా నీటి వినియోగదారుల సంఘాలు ఉండేవి. వాటి పరిధిలో ఏం జరిగినా సంఘం సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేసేవారు. గతంలో తెలంగాణ ఉద్యమం కారణంగా సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ మిషన్ కాకతీయ పేరుతో నీటి సంఘాలను అటకెక్కించారు. ప్రతి చెరువుకు ప్రత్యేకంగా నీటి సంఘాల పాలక మండలిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదన రావడంతో ఎన్నికల విధానమా? నామినేటెడ్ విధానమా? అనే సమాలోచనలో ప్రభుత్వం ఉంది.

వనపర్తి జిల్లాలో చిన్నవి, పెద్దవి కలిపి మొత్తం 1179 చెరువులు ఉన్నాయి. వీటితో పాటు చెక్ డ్యామ్ లు ఉన్నాయి. జిల్లాలోని రైతులు మొత్తం 3,60,000ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. సాగునీటి పారుదల శాఖ వారి పరిధిలో సుమారు 2,50,000 ఎకరాల్లో పంట సాగు చేస్తుండగా మిగిలినది. బోర్లు, బావులు, వర్ష ఆధారిత పంటలను సేద్యం చేస్తున్నారు. వ్యవసాయ రంగం దినదిన అభివృద్ధి చెందుతూ ఉండటంతో నీటి వనరుల సమస్యను గుర్తించి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించడానికి సాగు నీటి సంఘాల ఆవశ్యకత ఎంతైనా ఉంది.

● సాగు నీటి సంఘాల విధులు

రైతుల సమూహాలు సాగునీటి అవసరాలను సమన్వయం చేసుకుంటూ నీటిని సమర్థంగా వినియోగించుకునేలా కలిసి పని చేయాలి. నీటి పంపిణీ, కాల్వలను నిర్వహణ, నీటి నాణ్యత పరిరక్షణను సంరక్షించే విధంగా నీటి నిర్వహణలో సాగునీటి సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయి. నీటి వృథాను తగ్గించడం కాలువలను శుభ్రంగా ఉంచడం, అవసరమైన చోట మరమ్మతులు చేయించడం, నీటి వినియోగంలో రైతుల మధ్య సహకారాన్ని పెంపొందించడం లాంటి విధులు నిర్వహిస్తారు. నీటి సంఘాలు ఏర్పడిన అనంతరం ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సాయం, అందించి శిక్షణ, సాంకేతిక సహాయం అందిస్తుంది. రైతుల జీవనాధారమైన వ్యవసాయానికి సంఘాలు ఉపయోగకరంగా మారుతాయి. గతంలో సేద్యం చేసిన పంటలకు ప్రభుత్వం శిస్తులు (పన్నులు) వసూలు చేసేవారు. ప్రస్తుతం రైతులు ఉచితంగా నీటి వినియోగం పొందడంతో నీటి సంఘాల నిర్వహణకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాల్సిన ఉంటుంది.


ఖిల్లాఘణపురం మండలం మల్కిమియాన్‌పల్లి చిన్నయ్య కుంట చెరువు తూము షట్టర్ గేట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దసరా సెలవు రోజులు కావడంతో చెరువులో నిలువ చేసిన 40శాతం సాగు నీరు వృథాగా కాలువల్లో వెళ్లిపోయింది. గత కొన్ని సంవత్సరాలుగా చెరువు లోపలి, చెరువు బయట రైతుల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో నీటి సంఘాలు ఉంటే పర్యవేక్షణలో రైతుల సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంది. సాగునీటి వినియోగదారుల సంఘం వ్యవస్థను పునరుద్ధరించడం వల్ల సాగునీటి వనరులను రైతులు సక్రమంగా వినియోగించుకుంటారు. ప్రభుత్వం సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో రైతుల్లో ఆసక్తి నెలకొంది. కాల్వల మరమ్మతులు, నిర్వహణ పనులను చేయడానికి నీటి సంఘాలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ప్రచారంలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసి చెరువులను మరింత అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

● సాగునీరు వినియోగం

నీటి సంఘాలతోనే చెరువులు అభివృద్ధితో పాటు నీటిని పొదుపుగా వాడుకునే అవకాశం ఉంటుంది. సాగు నీటి వినియోగం సక్రమంగా ఉంటుంది. చెరువులపై పర్యవేక్షణ పెరుగుతుంది. గతంలో ప్రధాన చెరువుల ఆయకట్టు రైతులు డైరెక్టర్లను, చైర్మన్‌ను ఎన్నుకునేవారు. రైతులను సమన్వయ పరుస్తూ అభివృద్ధి పనులు చేపట్టేవారు.

- గోనేల శంకర్, రైతు, ఖిల్లాఘణపురం

నీటి సంఘాలతోనే చెరువుల అభివృద్ధి



నీటి సంఘాలలోని పాలకవర్గం ద్వారానే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో కరువు కాలంలో సైతం నీటి సంఘాల సాలకవర్గం సభ్యులు నీటిని పొదుపుగా వాడుకునే విధంగా పర్యవేక్షణ పకడ్బందీగా చేశాం. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో చెరువులను అభివృద్ధిలో జవాబుదారితనం లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. క్షేత్రస్థాయిలో రైతుల మధ్య నీటి తగాదాలను పరిష్కరించవచ్చు. సాగునీటి సరఫరాలో సమస్యలు ఉన్న వెంటనే పరిష్కారం అవుతాయి. రైతులను సమన్వయం చేసే అవకాశం ఉంది.

- మందడి ప్రభాకర్‌రెడ్డి, నీటి సంఘం మాజీ చైర్మన్, ఖిల్లాఘణపురం

కిక్‌బాక్సింగ్ సిటీ లీగ్ టోర్నీలో

జిల్లా క్రీడాకారుల ప్రతిభ

» మహబూబ్‌నగర్ జిల్లాకు 57 పతకాలు

» నాగర్‌కర్నూల్‌కు 16, వనపర్తికి 13..


ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్‌బాక్సింగ్ సిటీ లీగ్‌లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అస్మిత-ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్‌బాక్సింగ్ సిటీ లీగ్ పోటీలు ముగిశాయి. ఆదివారం రాత్రి వరకు పోటీలు జరిగాయి. టోర్నీలో మహబూబ్‌నగర్ జిల్లా 57, నాగర్‌కర్నూల్ 16, వనపర్తి జిల్లాకు 13 పతకాలు వచ్చాయి. విజేతలకు కిక్‌బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మహిపాల్ పతకాలు అందజేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, రవినాయక్, కోచ్‌లు, రెఫరీలు పాల్గొన్నారు.

సాధించిన పతకాల వివరాలు....

జిల్లా	స్వర్ణ	వెండి	కాంస్య	మొత్తం
మహబూబ్‌నగర్	31	15	11	57
నాగర్‌కర్నూల్	04	03	02	09
రంగారెడ్డి	03	05	01	09
వనపర్తి	02	02	00	04
వికారాబాద్	02	01	01	04
హైదరాబాద్	02	01	00	03
హన్మకొండ	01	01	01	03
పెద్దపల్లి	01	00	00	01

కబడ్డీ అండర్-14 విజేత మహబూబ్‌నగర్


రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేతగా నిలిచిన ఉమ్మడి మహబూబ్‌నగర్ బాలికల జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరువులో మైత్రీ మైదానంలో ఈ నెల 16 నుంచి 18వ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచింది. రాష్ట్రస్థాయి టోర్నీలో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు చాంపియన్‌గా నిలువడం పట్ల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అభినందించారు. రాష్ట్ర స్థాయి టోర్నీల్లో జిల్లా జట్టు విజయాలు సాధించడంతో పాటు జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు.

నేషనల్ కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ


నేషనల్ కరాటే టోర్నీలో పతకాలు సాధించిన జీకే మాస్టర్ షోటోకాన్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పట్టణంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి టోర్నీలో జిల్లా కేంద్రంలో జీకే మాస్టర్ షోటోకాన్ విద్యార్థులు ప్రతిభ చాటారు. శ్రావణి బంగారు, స్వాతి కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను జీకే మాస్టర్ చీఫ్ కృష్ణయ్య, కరాటే మాస్టర్ శివకుమార్ అభినందించారు.

పండుగ వేళ.. ప్రతీది పిరం

- బంధువులతో కిటకిటలాడుతున్న గ్రామాలు
- బాణాసంచా కొనుగోలు చేసిన ప్రజలు

కొత్తకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ శుభవేళ చిరు వ్యాపారుల నుంచి నిత్యావసర దుకాణదారులు, దుస్తుల షాపుల వారు అందినకాడికి జేబులో నొక్కేస్తున్నారు. పండుగను నిర్వహించుకునే ప్రజలు సైతం ఏ వస్తువు ఇంట్లో తక్కువ ఉండొద్దని డబ్బులకు లెక్క చేయకుండా కొనుగోలు చేస్తున్నారు. కొత్త దుస్తులు, నిత్యావసర వస్తువుల ధరలు ఎప్పుడు ఎలా ఉంటాయో ప్రజలకు తెలియదు. కానీ పండుగకు ఇంటికి కళ వచ్చే బంతిపూల ధరలు కిలో వంద రూపాయలు పలకడం ఆశ్చర్యకరం. అలాగే దీపం దివ్వెల ధరలు ఎక్కువగా ఉన్న తక్కువ కాకుండా కొంటున్నారు.



అమ్మకానికి ఉంచిన బంతిపూలు

బంధువులతో కిటకిట ..

గ్రామాలు బంధువులతో కిటకిటలాడుతున్నాయి. దీపావళి వచ్చిందంటే ఇంటి ఆడ పిల్లలను అల్లుళ్లను ఆహ్వానించి పండుగ జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుంది. దీపావళి నాటికి మెట్ట పంటలు ఇంటికి రావడం ధాన్యలక్ష్మీతో రైతులు సంతోషంగా పండుగను జరుపుకుంటారు. ఇంటిని మామిడి తోరణాలు, పూలతో అలంకరించి పిండి వంటలు తయారు చేసుకొని చనిపోయిన కుటుంబ పెద్దలను స్మరించుకుంటూ సంతోషంగా ఆరగించడం ఆనవాయితీగా ఉంటుంది. రాత్రికి కుటుంబ సభ్యులు అందరు కలిసి రకరకాల టపాసులు కాల్చుతూ సరదా ముచ్చట్లతో మునిగిపోతారు.

ఆత్మకూరు : నేడు దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. బాణాసంచా పేల్చే క్రమంలో కావాల్సినంత దూరం పాటించాలని, లేకుంటే నిప్పురవ్వలు కళ్లలోకి ఎగిరి పడే ప్రమాదముందని తెలిపారు. అలాగే మందపాటి కాటన్ దుస్తులు ధరించి బాణాసంచా పేల్చాలని ఇంటి లోపల బాణాసంచా పేల్చకూడదని, చిన్నపిల్లలను కొవ్వొత్తులు, దీపాలు, క్రాకర్స్ వంటి వాటిని వెలిగించేందుకు అనుమతించకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు విద్యుత్ వైర్లకు దూరంగా బాణాసంచా పేల్చి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు.

దీపావళిని ఆనందంగా జరుపుకుందాం

వనపర్తి టౌన్ : మర్చిపోవాల్సిన గతాన్ని, గతం తాలుకు జ్ఞాపకాలని, మనుషుల్ని దీపావళి అమావాస్య చీకట్లో వదిలేసి దీపావళి కాంతుల వెలుగులో కొత్త ఆలోచనతో ముందుకు సాగుతూ దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఏపీసీ హెచ్ (హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్) జిల్లెల ఆదిత్యరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలు, పెద్దలు పటాకులు పేల్చే సందర్భంలో జాగ్రతగా ఉండాలని, దీపావళి పండుగ ప్రతీ ఒక్కరి జీవితంలో సుఖశాంతులను, సిరి సంపదలనను నింపుతూ సంపూర్ణ ఆరోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు.



దీపం దివ్వెలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

న్యూస్ బాక్స్


గ్రూప్-2 ఉద్యోగం సాధించిన అభ్యర్థికి ఎమ్మెల్యే సన్మానం



భరత్‌కుమార్‌ను సన్మానిస్తున్న మేఘారెడ్డి

వనపర్తి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ద్వారా ఉద్యోగం సాధించిన అభ్యర్థిని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణానికి చెందిన భరత్ కుమార్ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభతో స్టేట్ 59వ ర్యాంక్ సాధించి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం సాధించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం భరత్‌కుమార్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో డీటీ ఉద్యోగంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఫజిల్ తదితరులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

వీపనగండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో దీపావళి పండుగ పాముకాటు జాతర సందర్భంగా నిర్వహిస్తున్న వీపీఎల్ సీజన్ -5 ఏపీఎల్-2 క్రికెట్ పోటీలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్య, రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు ముంత మల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డిలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రీడలు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దోహదపడుతాయని తెలిపారు. గెలుపు ఓటములను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు రవీందర్‌రెడ్డి, యాదయ్య, నారాయణ, గోపి, రామనాగులు, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో నాంచారమ్మపేట తండా దర్గా ఉర్సు



దర్గాను దర్శించుకుంటున్న నాయకులు

కొత్తకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాంచారమ్మపేట తండా సమీపంలోని అబ్దుల్లా సాబ్ దర్గా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రారంభమయ్యాయి. దర్గా సమీప గ్రామాలైనా నాటవెళ్లి, విలియంకొండ, విలియంకొండ తండా, నాటవెళ్లి పెద్దతండా, వనపర్తి మండలం నాచనహళ్లి, మెట్టంపల్లి గ్రామాల రైతులు ఉత్సవాల్లో పాల్గొని గొర్రె పోతులతో కందూరు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సాయులు యాదవ్, ముజీబ్, వెంకటేష్ దర్గాను దర్శించుకున్నారు. దర్గా నిర్వాహకులు నాయకులను శాలువాతో సన్మానం చేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



సమావేశమైన కార్యవర్గ సభ్యులు

అమరచింత, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అమరచింత మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం సాయంత్రం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమరచింత హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన సమావేశానికి రిటైర్డ్ ఎంఈవో ఎస్సీ రత్నం అధ్యక్షతన కొనసాగింది. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్షులు ఎస్సీ రత్నం, ప్రధాన కార్యదర్శి వై సురేందర్, కోశాధికారి క్యామరాములు, అసోసియేట్ అధ్యక్షుడు ఎన్ మీనీ వర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండీ షేక్ అహ్మద్, ఎస్సీ పద్మమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజేశ్వరి, ఎస్‌ఎం లూథర్, ప్రచార కార్యదర్శిగా శకుంతలమ్మ, ముఖ్య సలహాదారులుగా గోపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మణమ్మ, సత్యనారాయణ, వైబాలస్వామి సి.చంద్రశేఖర్, రాములు, పద్మమ్మ, విజయరెడ్డి, మన్నెమ్మ, సౌభాగ్యమ్మ తదితరులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

యువకుల్లో కరాటే ఆత్మస్థైర్యం పెంచుతుంది



కరాటే విద్యార్థులకు బెల్ట్‌లు అందజేస్తున్న సీఐ రాంబాబు

కొత్తకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కరాటే నేర్చుకున్న విద్యార్థులు, యువతి యువకుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని సీఐ రాంబాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో విద్యార్థులకు తైక్వాండో కరాటే బెల్ట్‌ల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బెల్ట్‌లను సీఐ అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ... కరాటేతో శారీరక దృఢత్వంతో పాటు మీ కళ్ల ముందు జరిగే అవాంఛనీయ సంఘటనలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, ఎస్‌ఐ ఆనంద్ నాయకులు బోయోజ్, శ్రీనివాసులు, జేసీబీరాము, ముజీబ్, కరాటే మాస్టర్లు నరేష్ నాయుడు, పెంటన్న యాదవ్, నరేందర్ సాగర్, శివశంకర్, పరశురాములు, రవి, సంతోష్, రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్తకోట విద్యార్థుల ప్రతిభ ..

పట్టణానికి చెందిన గాడ్స్‌ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ఆ అకాడమీ చైర్మన్ అబ్దుల్‌నబీ తెలిపారు. జడ్చర్లలోని చంద్ర గార్డెన్‌లో ఆదివారం జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న రుకయ్య, మదిహా కైకషా బంగారు పతకాలు గెలుపొందారు.

ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ లీగ్‌లో సింగరపు ఝాన్సీ ప్రతిభ



రామాంజనేయులుతో బంగారు పతకం అందుకుంటున్న ఝాన్సీ

వనపర్తి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన విద్యార్థిని సింగారపు ఝాన్సీ కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించడంపై ఆదివారం గ్రామస్థులు పలువురు అభినందించారు. ఈ నెల 18న మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ లీగ్‌లో వనపర్తి మండలం చిట్యాల గ్రామానికి చెందిన సింగరపు ఝాన్సీ పాల్గొన్నారు. హార్డ్ స్టైల్ వెపన్ విభాగంలో అండర్ 13, 14, 15లో పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించినట్లు చిట్యాల గోజురియా కరాటే అండ్ కిక్ బాక్సింగ్ అకాడమీ మాస్టర్ వరుణ్ తెలిపారు. విద్యార్థిని తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కరాటే శేఖర్ మాస్టర్ అభినందించాలని తెలిపారు. విద్యార్థిని తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కరాటే శేఖర్ మాస్టర్ అభినందించారని తెలిపారు.

నూతన అధ్యక్షుడికి సన్మానం

రేవల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తలుపునూరు గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా గురగాల కురుమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పలకనూరు గ్రామంలోని అంబేడ్కర్ యువజన సంఘంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడిగా బోడ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్, కోశాధికారిగా రాజు, సలహాదారులుగా చిన్నరాములు, కుంటి మధు, ప్రచార కార్యదర్శులుగా వేణు, కిరణ్, ప్రచార కార్యదర్శులుగా వేణు, కిరణ్, రాజేందర్‌ను ఎన్నుకున్నారు.

అనంతరం నూతన అధ్యక్షుడికి కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పెద్దగూడెంలో ప్రచారం చేస్తున్న భగవద్గీత కమిటీ సభ్యులు

వనపర్తి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రచార వాహనం ద్వారా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. గురువు తన జ్ఞానాగ్నితో శిష్యుల తలలో జ్ఞాన జ్యోతి వెలిగించి యోగ మార్గంలో నడిపిస్తాడు అనేందుకు గుర్తుగా దీపావళి రోజున ఇంట్లో దీపాలు వెలిగిస్తారన్నారు. మనం నివసించే ఇల్లును మానవ శరీరంతో పోలిస్తే, ఇంటి లోపల దీపాలు వెలిగించడం అనేది జ్ఞానాగ్నికి గుర్తు అన్నారు. త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు, విజయ భాస్కర్ రెడ్డి, పురుషోత్తం, నరేందర్, లోకేష్ మాసన్న, రామచంద్రయ్య, గణేష్, బాలకృష్ణ, శైలజ, జోతి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు రూ.24 లక్షలు మంజూరు

కొత్తకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల బీటీ రోడ్ల నిర్మాణాలకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూన్‌రెడ్డి రూ. 24. 30 లక్షలు మంజూరు చేయించినట్లు చర్లపల్లి భ్రమ మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కొత్తకోట నుంచి చర్లపల్లి రోడ్డుకు రూ. 8.82 లక్షలు, నాటవెళ్లి తండా రోడ్డుకు రూ.2 లక్షలు, కానాయపల్లి తండా రోడ్డుకు రూ.4.80 లక్షలు, కనిమెట్ట, పాతజంగమాయపల్లి రోడ్డుకు రూ.5. 40 లక్షలు, వడ్డెవాట నుంచి సత్యహళ్లి రోడ్డుకు రూ.3.30 లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరుపై ఆయా గ్రామాల ప్రజల తరపున శేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతికి మాజీ మంత్రి సంతాపం

వనపర్తి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని రాజపేట గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గొడుగు లక్ష్మయ్య ఆదివారం అనారోగ్యంతో మృతిచెందడంతో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మృతుడి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్తులో మీ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల సింగిల్ విండో అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, నాయకులు సుదర్శన్ రెడ్డి, మాధవరెడ్డి, అశోక్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు ఉన్నారు.

పలుగు రాళ్ల తరలింపులో జాగ్రత్తలేవి?



పలుగు రాళ్ల లోడుతో వెళ్తున్న వాహనం

ఖిల్లాఘణపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై తరచుగా పదుల సంఖ్యలో పలుగురాళ్లు తరలించే భారీ బెంజ్ వాహనాలు వెళ్తుంటాయి. మండలంలోని కర్నెతండా గుట్టలో ఉన్న మైనింగ్ నుంచి పలుగు రాళ్లను బాల్ నగర్ మండలంలోని టైల్స్ తయారు చేసే పరిశ్రమకు తరలిస్తుంటారు. పెబ్బేరు మండలంలోని మైనింగ్ నుంచి ఖిల్లాఘణపురం మండలంలోని తిరుమలాయపల్లి టైల్స్ పౌడర్ తయారు చేసే పరిశ్రమకు తరచుగా తరలిస్తుంటారు. బెంజ్ వాహనాల్లో పరిమితికి మించి రాళ్లను లోడ్ చేసి రాళ్లు ఎక్కడ పడిపోతాయో తెలియని విధంగా వేగంగా వాహనాలను నడిపిస్తారు. లోడుతో ఉన్న వాహనంపై ఎలాంటి జాగ్రత్తలు టార్పలిన్ కవర్లు కప్పకుండా తరలించడంతో రోడ్డుపై బండరాళ్లు పడిపోతుంటాయి. గతంలో పలుగు రాళ్లను తరలించే వాహనం అతివేగంగా వచ్చి అదుపు తప్పి మండల కేంద్రం శివారులో బోల్తా పడిన సంఘటనలు ఉన్నాయి. ఇష్టారీతిగా పరిమితికి మించి వాహన రాకపోకలు జరగడంతో బీటీ రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. హైవేపై వెళితే శాగాపూర్ వద్ద టోల్ గేట్ ఛార్జీల భారం పడుతుందని తప్పించుకోవడానికి వాహన డ్రైవర్లు ఖిల్లాఘణపురం మీదుగా రాకపోకలు కొనసాగిస్తుంటారు. పలుగు రాళ్ల తరలించే వాహనాలు నుంచి స్పీడ్ బ్రేకర్ వద్ద రాళ్లు కింద పడిపోతున్నాయి. వాటిని గమనించని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి.

నేటి నుంచి గంగమ్మ జాతర



గంగమ్మ దేవత, జాతరలో ఏర్పాటు చేసిన గుడారాలు

వీపనగండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు గంగమ్మ (పాముకాటు) జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు ఆశ్వయుజ బహుళ శుద్ధ అమావాస్య రోజున అమ్మవారికి నోములు రెండో రోజు ఆలయం దగ్గర అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు కార్యక్రమాలు ఉంటాయి. మూడో రోజు అమ్మవారి ఊరేగింపు ఉత్సవాలు, అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ ఉత్సవాలకు చుట్టు పక్కల మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకుంటారు. ఈ సందర్భంగా గ్రామంలో పాటల పోటీలు, బ్రహ్మంగారి నాటక ప్రదర్శన కొన్ని సంస్కృతి ఉత్సవాలు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా తినుబండగారాలు బొమ్మలు వంటి గుడారాలు వెలుస్తాయి.

పుట్టిన గడ్డకు సేవ చేస్తా..

- బీజేపీలో చేరికల కార్యక్రమంలో పాల్గొన్న గువ్వల బాలరాజు



బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గువ్వల బాలరాజు

రేవల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన గడ్డ రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. రేవల్లి మండలంలోని పాతతండా గ్రామంలో ఆదివారం జరిగిన బీజేపీ చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీలో చేరిన యువకులను, మహిళలకు పార్టీ కండువా కప్పి దాదాపు 50 మందిని బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వనపర్తిలోనే పదో తరగతి వరకు చదువుకున్నానని, అక్షర జ్ఞానం నేర్పిన వనపర్తి గడ్డ రుణం తీర్చుకోవడం కోసం అర్ధరాత్రి అయినా వస్తానని బీజేపీ నాయకుల కార్యకర్తల సహకారంతో వనపర్తిని చుట్టేస్తానని అన్నారు. ఆ రోజు తెలంగాణ కోసం జెండా పట్టానని, నేడు దేశం కోసం కాషాయం కండువా వేసుకున్నానని నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు కాషాయం కండువనే ఒంటిపై ఉంటుందన్నారు. ఆర్ఎస్ఎస్‌ను అవహేళన చేస్తూ అవహాస్యం చేస్తూ నవ్వుతున్నారని హిందుత్వాన్ని కాపాడింది ఆర్ఎస్ఎస్ అని అన్నారు. శ్రీనివాస్ నాయక్, బీజేపీ నాయకులు అయ్యగారి ప్రభాకర్, లోక్‌నాథ్‌రెడ్డి, పెద్దిరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, అజయ్‌గౌడ్, మణివర్ధన్‌సాగర్, తిరుపతి నాయక్, బాలు నాయక్ పాల్గొన్నారు.

'కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం'

ఆత్మకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కంబలాపురం రాము పేర్కొన్నారు. ఆత్మకూరు మండల పరిధిలోని బాలకృష్ణపూర్, జూరాల గ్రామాల్లో రాజు, తులసిరాజ్ మాతృమూర్తులు ఇటీవల కాలంలో మృతి చెందారు. దీంతో ఆదివారం వారి కుటుంబాలను కలిసి మనోధైర్యాన్ని కల్పిస్తూ ఎలాంటి అధైర్య పడకుండా ఉండాలని సూచించారు. అనంతరం వారి ఆర్థిక పరిస్థితులను తెలుసుకొని వారికొ కొద్దిపాటి ఆర్థిక సాయం అందజేశారు.

కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్లన్న, మాసన్న, శ్రీనివాసులు, ఈశ్వర్, సాయికుమార్, సుభాష్ నాయక్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యమం తీవ్రతరం చేస్తాం..

- బీసీ సంఘం నాయకులు

వనపర్తి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ సాధన కోసం భవిష్యత్తులో బీసీ ఉద్యమం తీవ్రతరం చేస్తామని బీసీ సంఘం నాయకులు అన్నారు. బీసీ ఉద్యోగ సంఘం నాయకుడు కురుమయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి పట్టణంలోని పలు ప్రధాన చౌరస్తాల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీలకతీతంగా బీసీ సంఘం నాయకులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతమే కాకుండా అవసరమైతే 50 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పార్లమెంట్‌లో ఎన్డీయే ప్రభుత్వం, ఇండియా కూటమి కలిసి బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని, రాష్ట్రపతిని ఒప్పించే బాధ్యత కూడా రెండు పార్టీలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ రిజర్వేషన్ బిల్లుకు రాజ్యాంగ భద్రత కల్పించాలన్నారు. నిన్నటి వరకు బీసీ ఉద్యమం నివురు కప్పిన నిప్పులా ఉందని, నేటి నుంచి ఎగిసిపడే లావాలా మారే సమయం వచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమం జరగబోతుందని, బీసీలు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. శనివారం జరిగిన బీసీ రాష్ట్ర బంద్‌కు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలతో పాటు వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, ఉద్యోగ సంఘం నాయకులు, విద్యార్థులు, ప్రజా సంఘం నాయకులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారని, వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ పొలిటిక్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్, అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, వాకిటి శ్రీధర్, ఉంగ్లం తిరుమల్, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, బొంబాయి మన్నెంకొండ, శంకర్ గౌడ్, సీపీఎం పట్టణ అధ్యక్షుడు రమేష్, సీపీఐ నాయకుడు గోపాలకృష్ణ, అరవిందస్వామి, కిరణ్, బీజేపీ నాయకుడు బత్తిని మధు, టీడీపీ నాయకులు కొత్తగొల్ల శంకర్, డి బాలరాజు, గౌనికాడి యాదయ్య, ధర్మేంద్రసాగర్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘం నాయకులు

గిరిజన గురుకులాల పేర్లు కొమరం భీమ్‌గా మార్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న హిందూ వాహిని నాయకులు

వనపర్తి విద్యా విభాగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : హిందూ వాహిని ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. హిందూవాహిని ఉమ్మడి పాలమూరు విభాగ్ కన్వీనర్ అభిలాష్ హొదేకార్ మాట్లాడుతూ రజాకార్ల నుండి తెలంగాణ విముక్తి కోసం సాగించిన పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన వీరుడు మన కొమరం భీమ్ అన్నారు. భారతదేశంలో ఆదివాసీల హక్కుల కోసం జరిగిన పోరాటాలు చారిత్రాత్మకమైనవని, ఆదివాసీలపై నిజాంనవాబులు చేసిన దోపిడీ, దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించి జల్ జంగిల్ జమీన్ నినాదానికి ప్రతీకగా నిలిచిపోయాడన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం తన ప్రాణాలు అర్పించిన యోధుడు మన కొమరం భీమ్ అని, అలాంటి ధైర్య సాహసాలు కలిగిన మహోన్నత వ్యక్తుల పేర్లు చరిత్రలో నిలిచిపోవాలన్నా, వారి త్యాగాలను స్మరించుకోవాలన్న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన గురుకులాల పాఠశాలలను కొమరం భీం గురుకుల పాఠశాలగా మార్చాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హిందూ వాహిని జిల్లా శాఖ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఒక వేళ కొమరం భీమ్ పేరు పెట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున హిందూ వాహిని ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అరుణ్ గౌడ్, కో కన్వీనర్ శ్రీకాంత్, నవీన్, శరత్, రాఘవేంద్ర రెడ్డి, తదితర హిందూ వాహిని కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.